సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం । 17 । అక్టోబర్ । 2023



కుంజా సత్యవతి ఇకలేరు

భద్రాచలం మాజీ ఎమ్మెల్యే కుంజా సత్యవతి సోమవారం తెల్లవారు జామున గుండెపోటు తో మృతిచెందారు. 10లో



భారీగా నగదు సీజ్

ఎన్నికల నేపథ్యంలో పోలీసుల తనిఖీల్లో ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.45.38 లక్షలు సీజ్ చేశారు. 10లో

గరిష్టం / కనిష్టం 33°/22°

వాతావరణం

జిల్లాలో మంగళవారం ఉష్ణోగ్రత అధికంగా నమోదవుతుంది. ఉదయం మొదలైన ఎండ మధ్యాహ్నం వరకు పెరుగుతుంది.

న్యూస్‌రీల్

గిరిజనులందరికీ సంక్షేమ ఫలాలు అందాలి



గిరిజనుల సమస్యలు తెలుసుకుంటున్న పీఓ ప్రతీక్‌జైన్

భద్రాచలం: ప్రతీ గిరిజన కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు దరిచేరాలని ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ అన్నారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఆయన పాల్గొని ఆదివాసీ, గిరిజనుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం సంబంధిత యూనిట్ అధికారులకు అందచేశాక ఆయన మాట్లాడుతూ దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి అర్హులకు ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ పథకాల అమలులో అధికారులు నిర్లక్ష్యం వహించొద్దని తెలిపారు. ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, గిరిజన సంక్షేమ డీడీ మణెమ్మ, అధికారులు తానాజీ, శ్రీనివాస్ మునీర్‌పాషా, ఉదయ భాస్కరన్, హరికృష్ణ, ఆదినారాయణ, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామంలో ఐసీఎంఆర్ బృందం



గిరిజనుల నుండి రక్తనమూనాలు సేకరిస్తున్న వైద్యులు

అశ్వాపురం: అశ్వాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మారుమూల గిరిజన గ్రామమైన రాయన్‌పేటను ఢిల్లీకి చెందిన ఇండియన్ కౌన్సిల్ ఫర్ మెడికల్ రీసెర్చ్(ఐసీఎంఆర్) బృందం సోమవారం సందర్శించింది. మలేరియా నియంత్రణలో భాగంగా గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించి పలువురి నుంచి రక్తనమూనాలు సేకరించారు. అలాగే, మలేరియా, డెంగీ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గిరిజనులకు అవగాహన కల్పించారు. వలస ఆదివాసీ గ్రామాలకు ఛత్తీస్‌గఢ్ నుంచి రాకపోకలతో మలేరియా ప్రబలుతోందని తెలిపారు. ఐసీఎంఆర్ బృందం నెల పాటు జిల్లాలో పర్యటించి మారుమూల వలస ఆదివాసీ గ్రామాల ప్రజలకు అవగాహన కల్పించడమే కాక మలేరియాకు సంబంధించిన మందుల పనితీరుపై అధ్యయనం చేయనున్నారు. ఐసీఎంఆర్ బృందం సభ్యులు పాడియాభట్, మనిష్‌కుమార్, చంద్రవంశీ, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ స్పందన, అసిస్టెంట్ మలేరియా అధికారి గొంది వెంకటేశ్వర్లు, సబ్ యూనిట్ అధికారి లింగ్యా నాయక్, తదితరులు పాల్గొన్నారు.

వీడని పీటముడి

కొత్తగూడెం సీటు కోసం సీపీఐ పట్టు

- ఆ పార్టీకి ఇవ్వొద్దంటున్న కాంగ్రెస్ కేడర్
- కమ్యూనిస్టులకే ఖరారంటూ జోరుగా ప్రచారం
- ఆందోళన ఉధృతం చేస్తున్న 'హస్తం' శ్రేణులు



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: కాంగ్రెస్ అభ్యర్థుల జాబితా ప్రకటన తర్వాత ఆ పార్టీలో వేడి రాజుకుంది. ముఖ్యంగా జిల్లాలో ఏకైక జనరల్ స్థానంగా ఉన్న కొత్తగూడెంపై ఇటు సీపీఐ, అటు కాంగ్రెస్ తమకే కావాలంటూ పట్టుబడుతుండడంతో ఇక్కడ రాజకీయం రసకందాయంలో పడింది.

పోటీకి సై అంటున్న సీపీఐ..

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు గతంలో ఓసారి కొత్తగూడెం నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. సింగరేణి బొగ్గు గనులు, కేటీపీఎస్, ఇతర పరిశ్రమలకు కేంద్ర స్థానం కావడంతో సీపీఐ అనుబంధ కార్మిక సంఘమైన ఏఐటీయూసీ ఇక్కడ బలంగా ఉంది. దీంతో ఈసారి అసెంబ్లీ ఎన్నికల బరిలో సీపీఐ అభ్యర్థి కొత్తగూడెం నుంచి పోటీ చేయాలంటూ కూనంనేని బలంగా వాదిస్తున్నారు. ఈ మేరకు గతేడాది కాలంగా పోటీ విషయమై క్షేత్ర స్థాయిలో కసరత్తు ప్రారంభించారు. ఏ పార్టీతో పొత్తు పెట్టుకున్నా కొత్తగూడెంపై తేల్చిన తర్వాతే మిగితా అంశాలంటూ బహిరంగంగానే అనేక సార్లు ప్రకటించారు.

రంగంలోకి నారాయణ..

కొత్తగూడెం సీటు తమకే కావాలంటూ సీపీఐ బలంగా అడగడంతో తమవల్ల కాదంటూ బీఆర్‌ఎస్ పొత్తుకు నై అంది. ఆ తర్వాత కాంగ్రెస్‌తో చర్చలు ప్రారంభమయ్యాయి. సీపీఐ జాతీయ నేత కె.నారాయణ కాంగ్రెస్ అగ్రనేతలతో పొత్తులపై చర్చిస్తున్నారు. ఇందులో కొత్తగూడెం తమకు కావాలన్నదే పార్టీ ప్రధాన డిమాండ్‌గా ఉంది. దీంతో జాతీయ స్థాయిలో పార్టీ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కొత్తగూడెం సీటును సీపీఐకి ఇచ్చేందుకు కాంగ్రెస్ హై కమాండ్ సుముఖంగా ఉందనే ప్రచారం జోరందుకుంది.

మారుతున్న కాంగ్రెస్ స్వరం..

నిన్నామొన్నటి వరకు పార్టీ హై కమాండ్ నిర్ణయమే శిరోధార్యం అని చెప్పుకొచ్చిన కాంగ్రెస్ నేతలు, వారి అనుచరుల స్వరం క్రమంగా మారుతోంది. గత ఐదేళ్లుగా పార్టీకి నియోజకవర్గంలో పెద్ద దిక్కు లేకపోయినా, అనేక కష్ట నష్టాలకు ఓర్చి పార్టీ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తున్న తమకు చివరి నిమిషంలో అన్యాయం చేయడమేంటని వారు ప్రశ్నలు సంధిస్తున్నారు. పొత్తుల పేరుతో కీలకమైన కొత్తగూడెం స్థానాన్ని త్యాగం చేయొద్దని కోరుతున్నారు. కాంగ్రెస్ పోటీ చేస్తే వర్గపోరును పక్కన పెట్టి అభ్యర్థి గెలుపు కోసం శ్రమిస్తామని చెబుతున్నారు.

తెరపైకి పొంగులేటి

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కొత్తగూడెం, ఖమ్మం, పాలేరు స్థానాలు జనరల్‌గా ఉన్నాయి. కొత్తగూడెం నుంచి మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అసెంబ్లీకి పోటీ చేస్తారని గతేడాది కాలంగా ఆయన అనుచరులు చెబుతున్నారు. ఈ మేరకు స్థానికంగా క్యాంప్ కార్యాలయాలు సైతం ఏర్పాటు చేశారు. అయితే కాంగ్రెస్ పార్టీలో చేరిన తర్వాత ఉమ్మడి జిల్లాలో ఎక్కడి నుంచైనా పోటీకి సిద్ధమని, ఏ స్థానమనేది పార్టీ పెద్దలు నిర్ణయిస్తారని పొంగులేటి ప్రకటించారు. మరోవైపు పొత్తుల్లో సీపీఐ, బీసీ అభ్యర్థి నినాదాలు గత నెలరోజులుగా గట్టిగా వినిపిస్తున్నాయి. దీంతో పొంగులేటి పాలేరు నుంచి బరిలోకి దిగుతారనే ప్రచారం జరిగింది. కానీ గత మూడు రోజులుగా పరిస్థితుల్లో మార్పు వచ్చింది. కొత్తగూడెం నుంచే బరిలో ఉండాలంటూ పొంగులేటి అనుచరులు ఆందోళన కార్యక్రమాలు చేస్తున్నారు. రెండు రోజుల క్రితం ఓ అభిమాని ఖమ్మంలో ఆత్మహత్యాయత్నం చేశాడు. మరుసటి రోజు కొత్తగూడెంలో పొంగులేటి ప్రధాన అనుచరులుగా ఉన్న పలువురు నాయకులు ఇదే అంశంపై పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని కలవడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

జంగ్ తెలంగాణ

ఒత్తిడిలో ఎడవల్లి

బీసీ కోటాలో కొత్తగూడెం నుంచి ఎడవల్లి కృష్ణ బరిలో ఉంటారంటూ గత నెల రోజులుగా పార్టీ పరంగా ప్రచారం జరిగింది. అయితే తొలి జాబితా ప్రకటించిన తర్వాత ఈ సీటు పొత్తులో సీపీఐకి కేటాయిస్తారనే ప్రచారం విస్తృతంగా ప్రజల్లోకి వెళ్లింది. దీంతో ఎడవల్లి అనుచరులు సైతం తమ నేతకే టికెట్ ఇవ్వాలంటూ ఆందోళన కార్యక్రమాలకు దిగుతున్నారు. ఓ దశలో మనస్తాపం చెందిన ఎడవల్లి పార్టీ మారుతున్నారంటూ సోషల్ మీడియాలో మెసేజ్‌లు వైరల్‌గా మారాయి. అయితే తనకు అలాంటి ఉద్దేశం ఏదీ లేదని ఎడవల్లి క్లారిటీ ఇచ్చారు. మొత్తంగా కొత్తగూడెం సీటు విషయంలో పై స్థాయిలో చర్చలు ఒక రకంగా జరుగుతుంటే క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి.

కాంగ్రెస్‌కేనని హామీ ఇచ్చారు..

కొత్తగూడెంరూరల్: కొత్తగూడెం అసెంబ్లీ టికెట్ కాంగ్రెస్‌కే ఇస్తామని టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని టీపీసీసీ ప్రచార కమిటీ కో కన్వీనర్ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన హైదరాబాద్‌లో రేవంత్‌రెడ్డిని కలిశారు. కొత్తగూడెం టికెట్ కాంగ్రెస్‌కే కేటాయిస్తామని, రాష్ట్రంలో గెలిచే స్థానాల్లో తప్పనిసరిగా కాంగ్రెస్ పోటీ చేస్తుందని చెప్పారని వివరించారు. పొంగులేటి వెంట నాయకులు ఊకంటి గోపాల్‌రావు, ఆళ్ల మురళి, తూము చౌదరి, ఆకునూరి కనుకరాజు, నాగేంద్రత్రివేది, ఎండీ ఖలీల్, కంచం వెంకటేష్ ఉన్నారు.



రేవంత్‌రెడ్డితో పొంగులేటి తదితరులు

సీఎం సభకు మైదానాల పరిశీలన



మైదానాన్ని పరిశీలిస్తున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే హరిప్రియ తదితరులు

ఇల్లెందు: నవంబర్ 1న ఇల్లెందులో జరుగు సీఎం కేసీఆర్ బహిరంగ సభ కోసం ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ సోమవారం పలు మైదానాలను పరిశీలించారు. లలితాపురం చిల్లా ముబారక్ సమీపాన గల ఖాళీ ప్రదేశం, జేకే కాలనీలోని సింగరేణి గ్రౌండ్, 24 ఏరియాలోని సింగరేణి గ్రౌండ్‌ను పరిశీలించారు. అక్కడ క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులను ఉత్సాహపరిచేందుకు రూ.10 వేల నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ కమిటీ చైర్మన్ దిండిగాల రాజేందర్, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, టీబీజీకేఎస్ నేతలు ఎస్.రంగనాథ్ పాల్గొన్నారు.

వేడుకగా నవరాత్రి ఉత్సవాలు

సంతానలక్ష్మి రూపంలో దర్శనమిచ్చిన అమ్మవారు



సంతానలక్ష్మి అలంకరణలో అమ్మవారు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి వేడుకలు ఘనంగా కొనసాగుతున్నాయి. శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారు సోమవారం సంతానలక్ష్మి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. సంతానం లేనివారు ఈ రూపంలో ఉన్న అమ్మవారిని కొలిస్తే వెంటనే పండంటి పిల్లలు పుడుతారని భక్తుల నమ్మకం. దీంతో సంతానలక్ష్మి అమ్మవారిని సంతానంతో పాటు సుఖసంతోషాలు ప్రసాదించాలని వేడుకున్నారు. అమ్మవారికి ఉదయం ప్రత్యేక స్నపన తిరుమంజనం, పూజలు చేయగా, మధ్యాహ్నం కుంకుమార్చన చేశారు. ఇందులో మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఇక, చిత్రకూట మండపంలో జరుగుతున్న శ్రీరామాయణ పారాయణోత్సవాల్లో భాగంగా వేద పండితులు, అర్చకులు అయోధ్య కాండ పారాయణం చేశారు.

నేడు గజలక్ష్మి అలంకరణలో..

'లక్ష్మీః దివ్యైః గజేంద్రై మణిగణఖచితైః స్నాపితా హేమకుంభైః' అని కీర్తిస్తారు పూర్వాచార్యులు. ఈ అమ్మను ఆరాధిస్తే అధికారము, మహా సంపద కలుగుతాయని పండితులు అంటున్నారు. గజలక్ష్మిని ఆరాధించడం వల్లే దేవేంద్రుడు త్రైలోకాధిపత్యాన్ని సాధించాడని పురాణంలో ఉందని, ఆ అమ్మను పూజిస్తే చెదరని అధికారం, తరగని సంపద కలుగుతాయని భక్తుల విశ్వాసం.

శాస్త్రోక్తంగా నిత్యకల్యాణం

శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక సోమవారం వైభవంగా సాగింది. తెల్లవారు జామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి అర్చకులు నిత్యకల్యాణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు.

శ్రీ గాయత్రీదేవిగా పెద్దమ్మతల్లి



గాయత్రీదేవి అలంకరణలో అమ్మవారి దర్శనం..

పాల్వంచరూరల్ : శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో రెండవరోజైన సోమవారం శ్రీ పెద్దమ్మ తల్లి గాయత్రీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా రుత్విక్‌లు, అర్చకులు ప్రాతఃకాలార్చన, శ్రీలక్ష్మీగణపతి అనుష్ఠానాలు, వేదపారాయణం, నవగ్రహ జపాలు చేశారు. అనంతరం శ్రీ సూక్తం, మన్య సూక్త పారాయణం, శ్రీ చక్రార్చన, రుద్రాభిషేకం, రుద్రహోమం, లక్ష కుంకుమార్చన, బాలపూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ ఎన్.రజనీకుమారి, ఆలయ కమిటీ చైర్మన్ మహిపతి రామలింగం పాల్గొన్నారు.

పనుల పురోగతిపై నివేదికలు అందజేయండి

కలెక్టర్ ప్రియాంక ఆల



ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రియాంక ఆల

సూపర్‌బజార్(కొత్తగూడెం): పనుల పురోగతిపై నివేదికలు అందజేయాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజలు అందించిన దరఖాస్తులు స్వీకరించి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు. అనంతరం ఇంజనీరింగ్ పనుల పురోగతి, కలెక్టరేట్‌లో బయోమెట్రిక్ హాజరు, అంగన్‌వాడీ కేంద్రాల్లో హార్వెస్టింగ్ స్ట్రక్చర్ తదితర అంశాలపై నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఇంజనీరింగ్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు శాఖల వారీగా చేపట్టిన పనుల పురోగతిపై నివేదికలు అందజేయాలని అన్నారు. గ్రౌండింగ్ చేసి జరుగుతున్న పనులపై మాత్రమే అందించాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున నూతనంగా ఎలాంటి పనులు చేపట్టరాదని స్పష్టం చేశారు. కొన్ని శాఖల్లో బయోమెట్రిక్ హాజరు శాతం తక్కువగా నమోదు కావడం పట్ల ఆయా అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని కలెక్టరేట్ ఏఓను ఆదేశించారు. ప్రభుత్వ సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. వర్షపునీటి సంరక్షణకు జిల్లాలో 324 అంగన్‌వాడీ కేంద్రాల్లో చేపట్టిన ఇంకుడుగుంతల ప్రగతిని సమీక్షించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు పి.రాంబాబు, మధుసూదన్‌రాజు, డీఆర్‌ఓ రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి అమలును పర్యవేక్షించాలి

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై పటిష్ట పర్యవేక్షణ ఉండాలని ప్రియాంక ఆల అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం అన్ని శాఖల అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల విధుల కేటాయింపునకు జిల్లా ట్రెజరీ కార్యాలయం నుంచి ప్రభుత్వ సిబ్బంది డేటా తీసుకోవాలని చెప్పారు. ఎన్నికల విధులు ఎంతో ప్రధానమైనవని, ఎవరికీ మినహాయింపు లేదని స్పష్టం చేశారు. ఎన్నికల కోడ్ కారణంగా ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ ఆస్తుల్లో ఉన్న ఆయా పార్టీల పోస్టర్లు, ఫొటోలు, ఫ్లెక్సీలను తొలగించాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో వసతులను పరిశీలించాలని, లోటుపాట్లు ఉంటే తక్షణమే నియోజకవర్గ రిటర్నింగ్ అధికారుల దృష్టికి తీసుకురావాలని చెప్పారు. సమావేశంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి నోడల్ అధికారి, జెడ్పీ సీఈఓ విద్యాలత, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

'ఆమె' చుట్టూ సంక్షేమం!



- ఉమ్మడి జిల్లాలో మహిళా ఓటర్లే కీలకం
- పురుషులతో పోలిస్తే 57,822 మంది ఎక్కువ
- అతివలను ఆకట్టుకునేలా అధికార, ప్రతిపక్షాల మేనిఫెస్టోలు
- మహిళల కోసం ప్రత్యేకంగా హామీలు
- పది స్థానాల్లో గెలుపోటములను ప్రభావితం చేయనున్న నారీమణులు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఈ ఎన్నికల్లో మహిళా ఓటర్లు ఎవరి వైపు మొగ్గు చూపుతారోనన్న అంశం ఆసక్తికరంగా మారింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పది నియోజకవర్గాల్లోనూ పురుష ఓటర్లతో పోలిస్తే మహిళా ఓటర్లే ఎక్కువగా ఉండడంతో రాజకీయ పార్టీల పరంగా ఈ చర్చ జరుగుతోంది. అన్ని నియోజకవర్గాల్లో కలిపి పురుషుల కంటే 57,822 మంది మహిళా ఓటర్లు ఎక్కువగా ఉండడం విశేషం. అభ్యర్థుల గెలుపు ఓటముల్లో వీరి ఓట్లు కీలకం కానుండడంతో.. అతివలను ప్రసన్నం చేసుకుని గెలుపు బాట పట్టాలన్న వ్యూహంతో రాజకీయ పార్టీలు సాగుతున్నాయి. ఇప్పటివరకు మహిళల సంక్షేమం కోసం అమలుచేసిన పథకాలతో పాటు ప్రస్తుత ఎన్నికల మేనిఫెస్టోలోనూ అధికార, ప్రతిపక్ష పార్టీలు మరిన్ని పథకాలు ప్రకటించడం విశేషం.

అంతటా వారే..

ఉమ్మడి జిల్లాలో పురుష ఓటర్లు 10,41,726 మంది, మహిళా ఓటర్లు 10,99,548 మంది ఉన్నారు. అత్యధికంగా ఖమ్మం నియోజకవర్గంలో 12,333 మంది మహిళా ఓటర్లు ఎక్కువగా నమోదు కాగా.. పినపాక నియోజకవర్గంలో తేడా 2,531గా ఉంది. గెలుపోటములను నిర్ణయించే స్థాయిలో వీరు ఉండడంతో అత్యధిక ఓట్లు రాబట్టుకునేలా అభ్యర్థుల ప్రచార శైలి సాగనుంది. ఓటర్ల పరంగా ప్రతీ నియోజకవర్గంలో వీరిదే పైచేయి కావడంతో రాజకీయ పార్టీలు ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నాయి. కుటుంబ ఓటింగ్‌లో మహిళల నిర్ణయమే ఫైనల్ అని భావిస్తూ.. మహిళా స్వయం సహాయక సంఘాలు, క్షేత్ర స్థాయి ఉద్యోగులు, గృహిణులను ఆకట్టుకునేలా ప్రచార కార్యాచరణ రూపొందిస్తున్నాయి.

నియోజకవర్గాల వారీగా మహిళలు, పురుష ఓటర్లు, ఎక్కువగా ఉన్న మహిళా ఓటర్ల సంఖ్య

నియోజకవర్గం	మహిళలు	పురుషులు	ఎక్కువ
ఖమ్మం	1,64,006	1,51,673	12,333
పాలేరు	1,19,994	1,12,607	7,387
కొత్తగూడెం	1,21,886	1,14,995	6,891
మధిర	1,12,599	1,05,978	6,621
భద్రాచలం	75,909	70,051	5,858
సత్తుపల్లి	1,21,645	1,16,968	4,677
వైరా	97,563	93,185	4,378
అశ్వారావుపేట	78,671	75,080	3,591
ఇల్లెందు	1,09,040	1,05,485	3,555
పినపాక	98,235	95,704	2,531
మొత్తం	10,99,548	10,41,726	57,822

అతివలే లక్ష్యంగా మేనిఫెస్టో

ప్రధానంగా మహిళా ఓటర్లే లక్ష్యంగా రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోలు ప్రకటించాయి. పురుష ఓటర్లతో పోలిస్తే మహిళా ఓటర్ల నాడి గుంభనంగా ఉండనుండడంతో వారిని ఆకట్టుకునేలా ఆయా పార్టీల నేతలు పథకాలు రూపొందించారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే మహిళల కోసం ఏం చేస్తారనే అంశాన్ని ప్రచారంలో కూడా ప్రత్యేకంగా ప్రస్తావించేలా ప్రసంగాలు సిద్ధం చేసుకుంటున్నారు.

చేసినవే కాదు.. కొత్తవి కూడా

బీఆర్‌ఎస్ ఇప్పటివరకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్, కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్, ఆరోగ్య మహిళ, ఒంటరి మహిళలకు పింఛన్ పథకాలు అమలు చేస్తోంది. అలాగే, మహిళల పేరుతోనే డబుల్ బెడ్‌రూం ఇళ్లు, ఇంటి స్థల పట్టాలు, గృహలక్ష్మి మంజూరు పత్రాలు అందజేస్తోంది. ఆయా పథకాలను బీఆర్‌ఎస్ అభ్యర్థులు తమ ప్రచారంలో ఉపయోగించుకునేలా మండలాల మహిళల అంకెలతో కరపత్రాలు ముద్రించారు. ఇక కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీల్లోనూ మహిళలకు ప్రాధాన్యత ఇవ్వడంతో తాజాగా బీఆర్‌ఎస్ వెల్లడించిన మేనిఫెస్టోలో మహిళల కోసం కొత్త హామీలను ఆ పార్టీ ప్రకటించింది. గతంలో ఉన్న వాటిని కొనసాగించడంతో పాటు తాజాగా నెలకు రూ.3 వేల జీవన భృతి, రూ.400కే గ్యాస్ సిలిండర్ వంటి హామీలు ఇచ్చింది.

గ్యారంటీలో మహాలక్ష్మి

కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలను అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో అమలు చేస్తామని నేతలు చెబుతున్నారు. ఇందులో మొదటిదిగా ఆ పార్టీ మహాలక్ష్మిని పేర్కొంది. ఈ పథకం కింద మహిళలకు ప్రతినెల రూ.2,500, రూ.500కే గ్యాస్ సిలిండర్, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణమని ప్రకటించింది. ఈ హామీలు మహిళా ఓటర్లను ఆకర్షించేలా ఉండడంతో తమకు మెజార్టీ మహిళల ఓట్లు ఖాయమనే అంచనాల్లో ఆ పార్టీ ఉంది.

'తాలిపేరు' పనుల పరిశీలన

దుమ్ముగూడెం: మండలంలో జరుగుతున్న తాలిపేరు కాలువ పూడికతీత పనులను భద్రాచలం సర్కిల్ ఇరిగేషన్ ఎస్‌ఈ కె.వెంకటేశ్వరరెడ్డి సోమవారం పరిశీలించారు. మండలంలోని తాలిపేరు కాలువ పూడుకుపోవడంతో నాలుగు రోజులుగా ఇరిగేషన్ అధికారులు పూడికతీత పనులు చేపట్టారు. అంజిపాక నుంచి కాటాయిగూడెం, అచ్చితాపురం నుంచి సుబ్బారావుపేట, నడికుడి, రామారావుపేట, పాతమారేడుబాక వరకు ఈ పనులు చేపట్టనున్నట్లు ఎస్‌ఈ తెలిపారు. త్వరితగతిన పూర్తి చేసి కాలువ చివరి వరకు నీరందేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట డీఈ మధుసూదన్‌రావు, జేఈ రాజ్‌సుహాస్, సిబ్బంది మస్తాన్ వలీ తదితరులు ఉన్నారు.

'ఓపెన్' పరీక్షలు ప్రారంభం

కొత్తగూడెంఅర్బన్: తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో ఓపెన్ పది, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. చుంచుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి, సింగరేణి ఉన్నత పాఠశాలలో ఇంటర్మీడియట్ పరీక్షలు నిర్వహించారు. ఇంటర్‌లో 104 మందికి 86 మంది పరీక్ష రాయగా 18 మంది గైర్హాజరయ్యారు. పదో తరగతిలో 94 మందికి 70 మంది మాత్రమే పరీక్షలు రాశారని డీఈఓ వెంకటేశ్వరాచారి తెలిపారు.

'గురుకులం'లో పతకాల పంట



విజేతలుగా నిలిచిన గురుకుల విద్యార్థినులు

భద్రాచలంటౌన్: నల్గొండ జిల్లా దామచర్లలో జరుగుతున్న ఉమ్మడి నల్గొండ, ఖమ్మం జిల్లాల జోనల్ స్థాయి గిరిజన క్రీడా పోటీల్లో భద్రాచలం గిరిజన గురుకుల విద్యార్థులు పతకాల పంట పండించారు. అండర్-14, 17, 19 విభాగాల్లో బాలికలు ప్రతిభ చాటి అన్ని విభాగాల్లో బహుమతులు కైవసం చేసుకున్నారు. అండర్-19 వాలీబాల్, కబడ్డీ, హ్యాండ్ బాల్, చెస్‌లో విజయం సాధించగా, ఖోఖోలో రన్నర్‌గా నిలిచారు. లాంగ్‌జంప్, హైజంప్‌లో శ్రీతేజ ప్రథమ స్థానం, షాట్‌పుట్‌లో ద్వితీయ స్థానం కైవసం చేసుకుని చాంపియన్‌షిప్ పొందింది. పరుగు పందెంలో నవదీపిక, అలేఖ్య ద్వితీయ స్థానంలో నిలువగా, చదరంగంలో ధనుశ్రీ ప్రథమ స్థానం పొందింది. అండర్-17 విభాగంలో విలువిద్యలో ప్రథమ, ద్వితీయ స్థానం, బాల్ బ్యాడ్మింటన్‌లో ప్రథమ స్థానం లభించింది. అథ్లెటిక్స్‌లో క్రీడల్లో అన్ని పోటీలలో విద్యార్థినీలు విజేతలుగా నిలిచారు. పోటీల ముగింపు సందర్భంగా సోమవారం ఐటీడీఏ ఏపీఓ డేవిడ్ రాజు నల్గొండ వెళ్లి విద్యార్థినులను అభినందించారు. కార్యక్రమంలో గిరిజన గురుకుల కళాశాల, పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.దేవదాసు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కాంగ్రెస్‌కు చండ్రుగొండ జెడ్పీటీసీ రాజీనామా


మాట్లాడుతున్న జెడ్పీటీసీ వెంకటరెడ్డి

చండ్రుగొండ : కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, జెడ్పీటీసీ కొడకండ్ల వెంకటరెడ్డి పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తన రాజీనామా లేఖను జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పొదెం వీరయ్యకు పంపించనున్నట్లు తెలిపారు. నాలుగు దశాబ్దాల రాజకీయ జీవితంలో కాంగ్రెస్‌ను వీడటం బాధాకరమని పేర్కొన్నారు. పార్టీ మొత్తం కాంగ్రెస్ వ్యతిరేక భావజాలం గల వారితో నిండిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీలో ముఠాలు కడుతున్నారని, కొంతకాలంలో జరుగుతున్న పరిణామాలతో తీవ్రంగా మథన పడినట్లు తెలిపారు. తప్పనిసరి పరిస్థితుల్లోనే రాజీనామా చేశానని, భవిష్యత్ రాజకీయ జీవితంపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటానని పేర్కొన్నారు.

ఎడవల్లి కృష్ణకు టికెట్ ఇవ్వాలని..

సెల్ టవర్ ఎక్కి ఆత్మహత్యాయత్నం


సెల్ టవర్ ఎక్కిన రాజేంద్రప్రసాద్ లోథ్

కొత్తగూడెంరూరల్: కొత్తగూడెం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ టికెట్ టీపీసీసీ జనరల్ సెక్రటరీ ఎడవల్లి కృష్ణకు ఇవ్వాలని కోరుతూ ఆ పార్టీ కార్యకర్త రాజేంద్రప్రసాద్ లోథ్ సోమవారం సీఎస్ఐ చర్చి ముందు సెల్ టవర్ ఎక్కి ఆత్మహత్యకు యత్నించాడు. సమాచారం అందుకున్న సీఐ కరుణాకర్ అక్కడుకు చేరుకుని నచ్చజెప్పారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాయల శాంతయ్య, పట్టణ అధ్యక్షుడు మల్లికార్జున్‌లు సెల్ టవర్‌పై ఉన్న వ్యక్తికి ఫోన్ చేసి కృష్ణకు టికెట్ వచ్చేలా కృషి చేద్దామని చెప్పడంతో సెల్ టవర్ దిగాడు. వెంటనే పోలీసులు అతన్ని స్టేషన్‌కు తరలించారు. కాగా రాజేంద్రప్రసాద్ పవర్ ప్లాంట్‌లో కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు.

గోల్డ్ మెడల్ సాధించిన హెడ్ కానిస్టేబుల్


ఖాదర్ అలీని అభినందిస్తున్న పోలీస్ అధికారులు

కొత్తగూడెంఅర్బన్: డోర్నకల్‌లో ఇటీవల జరిగిన ఐదు జిల్లాల బెంచ్ ప్రెస్ పోటీల్లో కొత్తగూడెం త్రీటౌన్ పోలీసు స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ ఖాదర్‌అలీ గోల్డ్ మెడల్ సాధించారు. సోమవారం డీఎస్పీ కార్యాలయంలో కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, ఇల్లెందు డీఎస్పీ రమణమూర్తి, సీఐ మురళి తదితరులు హెడ్ కానిస్టేబుల్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో టూటౌన్, లక్ష్మీదేవిపల్లి, టేకులపల్లి సీఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

తాలిపేరు కాల్వ గండి పూడ్చివేత పనులు ప్రారంభం


గండి వద్ద ఇసుక బస్తాలు వేస్తున్న దృశ్యం

చర్ల: మండలంలోని తాలిపేరు ఎడమ ప్రధాన కాల్వకు కుదునూరు సమీపంలో ఆదివారం గండి పడగా.. ఇరిగేషన్‌శాఖ అధికారులు పూడ్చివేత పనులు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టారు. ఎడమ ప్రధాన కాల్వకు గండి పడి దిగువన ఉన్న సుమారు 18 వేల ఎకరాల్లోని పంట పొలాలకు సాగునీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో సోమవారం గండి పూడ్చివేత పనులు ప్రారంభించిన అధికారులు.. తాత్కాలికంగా ఇసుక బస్తాలతో కట్ట ఏర్పాటు చేయించారు. ఇరిగేషన్ డీఈ తిరుపతి ఆధ్వర్యంలో పనులు చేపట్టగా మంగళవారం రాత్రి వరకు పూర్తిచేసి బుధవారం నుంచి సాగునీరు కాల్వ ద్వారా దిగువకు విడుదల చేయనున్నట్లు తెలిపారు.

క్షుద్ర పూజల కలకలం

జూలూరుపాడు: జూలూరుపాడులో సోమవారం క్షుద్ర పూజల కలకలం నెలకొంది. మండల కేంద్రంలోని మజీద్ పక్కన ఓ ఇంటి ఎదురుగా రోడ్డుపై క్షుద్ర పూజల ఆనవాళ్లను స్థానికులు గుర్తించారు. నిమ్మకాయలు, గాజులు, నల్లపూసల తాడు, పసుపు, కుంకుమ, వెంట్రుకలు, బొమ్మ ఉండటంతో ఆ ఇంటి వారు, స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి క్షుద్ర పూజలకు పాల్పడి ఉంటారని స్థానికులు చెపుతున్నారు. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

భారీగా నగదు సీజ్

- ఒక్క రోజే రూ.45.38 లక్షలు..
- ఇల్లెందులోనే రూ.17 లక్షలు పట్టివేత

ఇల్లెందు: ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నారు. రోజూ రూ. లక్షల్లో ఆధారాలు లేకుండా తరలిస్తున్న నగదును స్వాధీనం చేసుకుంటున్నారు. సోమవారం ఒక్క రోజే రూ.45.38 లక్షలను సీజ్ చేయగా, ఇల్లెందులోనే రూ. 17 లక్షలు పట్టుకున్నారు. ఇల్లెందులో ఓ పెట్రోల్ బంక్ నుంచి బ్యాంక్‌కు తరలి స్తున్న నగదును జగదాంబా సెంటర్‌లో ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ స్వాధీనం చేసుకుంది. రెండు రోజులుగా బ్యాంక్‌లకు సెలవులు ఉండటంతో కళాంజలి పెట్రోల్ బంక్‌లో మూడు రోజుల అమ్మకాల ద్వారా లభించిన నగదును బ్యాంక్‌కు తీసుకెళ్తుండగా రూ.17 లక్షలను ఫ్లయింగ్ స్క్వాడ్, ఏడీఏ వాసవీరాణి, ఎస్ఐ రవూఫ్‌లు పట్టుకున్నారు. రూ. 10 లక్షలకు మించి ఉంటే ఐటీ అధికారులకు సమాచారం అందిస్తారు. ఐటీ రిటర్న్స్ సమర్పించాల్సి ఉంటుంది. ఒకే పెట్రోల్ బంక్‌కు చెందిన నగదు వారంలో రెండోసారి పట్టుకున్నారు. నాలుగు రోజుల క్రితం కూడా రూ. 2 లక్షలు పట్టుకోగా, ఆధారాలు చూపడంతో పలు సలహాలు, సూచనలు చేసి వదిలేశారు. పోలీసులు నాలుగు రోజులుగా ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నారు. కొత్తగూడెం, ఖమ్మం, పాకాల కొత్తగూడ, మహబూబాబాద్ రూట్‌లో చెక్ పోస్టులు పెట్టి సోదాలు చేస్తున్నారు. అయితే తనిఖీల్లో రైతులు, వ్యాపారులు తీసుకెళ్లే నగదు పట్టుబడుతోంది.


ఇల్లెందు: సీజ్ చేసిన నగదుతో ఫ్లయింగ్ స్క్వాడ్ వాసవీరాణి తదితరులు

ఏ రాజకీయ పార్టీ నుంచి కూడా ఇప్పటివరకు ఒక్క రుపాయి కూడా తనిఖీల్లో స్వాధీనం చేసుకోలేదు.

కొత్తగూడెంలో రూ.13 లక్షలు..

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని అండర్ బ్రిడ్జి సమీపంలో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో రూ.13 లక్షల నగదును పోలీసులు పట్టుకున్నారు. రామవరానికి చెందిన పాలమూరి రామచందర్ తన వాహనంపై ఆధారాలు లేకుండా రూ.13 లక్షలు తీసుకెళ్తుండగా సీజ్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ కరుణాకర్ తెలిపారు. ఎస్సైలు బి.శ్రీనివాస్, జి.విజయ పాల్గొన్నారు.

చుంచుపల్లిలో రూ.6 లక్షలు..

చుంచుపల్లి: బాబూక్యాంపు వద్ద చుంచుపల్లి పోలీసులు సోమవారం నిర్వహించిన వాహన తనిఖీల్లో రూ.6 లక్షలను పట్టుకున్నారు. ఓ ద్విచక్ర వాహనదారుడు నుంచి ఈ నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల నియమావళి ప్రకారం అతను ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో పోలీసులు సీజ్ చేశారు.

దమ్మపేటలో రూ.3.50 లక్షలు..

దమ్మపేట: అల్లిపల్లి చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా ఆంధ్రప్రదేశ్ నుంచి వస్తున్న కారులో రూ. 3.50 లక్షల నగదు గుర్తించి సీజ్‌చేశారు. నగదు తెస్తున్న మండలంలోని మొద్దులగూడెం గ్రామానికి చెందిన వ్యాపారి సుగ్గాల ధర్మతేజ సరైన ఆధారాలు చూపలేదని పోలీసులు తెలిపారు.

చెక్‌పోస్ట్ వద్ద రూ 2.88 లక్షలు..

అన్నపురెడ్డిపల్లి: బూర్గూడెం వద్దనున్న అంతర్ జిల్లా సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న రూ 2.88 లక్షలను పట్టుకున్నారు. తిరువూరు నుంచి కొత్తగూడెం వైపు కారులో వెళ్తుండగా సీజ్ చేసినట్లు ఎస్సై షాహీన తెలిపారు.

అశ్వాపురంలో రూ.2 లక్షలు..

అశ్వాపురం: మండల కేంద్రంలోని టీడీపీ సెంటర్‌లో సోమవారం రాత్రి ఎస్సై తిరుపతిరావు వాహనాల తనిఖీ చేపట్టారు. అశ్వాపురానికి చెందిన దంపతులు బైక్ రూ.లక్షల నగదు తీసుకెళ్తుండగా పోలీసులు పట్టుకున్నారు. వారు ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో నగదును సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అశ్వారావుపేటలో రూ.లక్ష..

అశ్వారావుపేటరూరల్: సరిహద్దు చెక్‌పోస్టు వద్ద కారులో తరలిస్తున్న రూ. లక్షను సీజ్ చేసినట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. ఏపీలోని తూర్పు గోదావరి జిల్లా సీతానగరం మండలం మిడివాడ గ్రామానికి చెందిన వెంకట్రావు నగదు తీసుకెళ్తుండగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు.

కుంజా సత్యవతి ఇక లేరు..

- అనారోగ్యంతో మృతిచెందిన మాజీ ఎమ్మెల్యే
- కమ్యూనిస్టుల కంచుకోటలో ఎమ్మెల్యేగా విజయం
- సంతాపం తెలిపిన పలువురు ప్రముఖులు

భద్రాచలం: భద్రాచలం మాజీ ఎమ్మెల్యే కుంజా సత్యవతి హఠాన్మరణం పొందారు. సోమవారం తెల్లవారుజామున బీపీ తగ్గడంతో పాటు ఛాతిలో నొప్పితో బాధ పడుతుండగా కుటుంబసభ్యులు పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. గుండె వైద్య నిపుణులకు చూపించాలని డాక్టర్లు చెప్పగా మరో రెండు ప్రైవేట్ ఆస్పత్రులకు తీసుకెళ్లారు. స్థానిక వైద్యులు ప్రభుత్వ ఆస్పత్రికి రిఫర్ చేయగా, అక్కడికి వెళ్లే లోపే కన్నుమూశారు. సత్యవతి హఠాన్మరణంతో నియోజకవర్గ ప్రజలు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ తరపున భద్రాచలం నుంచి బరిలోకి దిగేందుకు క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తుండగానే ఆమె మృతి చెందడం బాధాకరమని పలువురు నివాళులర్పించారు.


సత్యవతి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పొదెం వీరయ్య


దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డితో కుంజా సత్యవతి (ఫైల్)

సీపీఎం కార్యకర్తగా రాజకీయాల్లోకి..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని వరరామచంద్రాపురం(వీఆర్ పురం)లో 1971 ఆగస్టు 1న జన్మించిన సత్యవతి భద్రాచలంలో స్థిరపడ్డారు. సీపీఎం కార్యకర్తగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన ఆమె 1988 నుంచి 94 వరకు ఐద్వా డివిజన్, జిల్లా జాయింట్ సెక్రటరీగా, 1994 నుంచి 2000 వరకు రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా పనిచేశారు. 2000 సంవత్సరంలో సీపీఎం నుంచి భద్రాచలం ఎంపీటీసీగా గెలుపొంది 2005 వరకు సేవలందించారు. 2006 నుంచి 2008 వరకు ఐద్వా కేంద్ర కమిటీ సభ్యురాలిగా బాధ్యతలు నిర్వర్తించారు.

వైఎస్సార్ చొరవతో కాంగ్రెస్‌లోకి..

భద్రాచలం ఏజెన్సీలో సత్యవతి సేవలను గుర్తించిన దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి 2009లో కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. అంతేకాక, 2009 ఎన్నికల్లో భద్రాచలం అసెంబ్లీ టికెట్ కూడా కేటాయించారు. అప్పటివరకు కమ్యూనిస్టులకు కంచుకోటగా ఉన్న భద్రాచలం నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా గెలుపొందిన సత్యవతి సరికొత్త రికార్డు సృష్టించారు. భద్రాచలంలో 1978 నుంచి 2004 వరకు సీపీఎం అభ్యర్థులే వరుసగా ఏడుసార్లు గెలుపొందగా, 2009లో వైఎస్సార్ ప్రభంజనంలో సత్యవతి భద్రాచలం నుంచి విజయం సాధించి రికార్డ్ బ్రేక్ చేశారు. ఇక 2014 ఎన్నికల్లో మళ్లీ కాంగ్రెస్ తరపున పోటీ చేసినా ఓటమి పాలయ్యారు.

బీజేపీలో క్రియాశీలకంగా..

2014లో కాంగ్రెస్ అభ్యర్థిగా ఓడిపోయిన సత్యవతి 2017 ఆగస్టులో బీజేపీలో చేరారు. 2018 ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఆ పార్టీలో రాష్ట్ర కమిటీ సభ్యురాలిగా, కార్యదర్శిగా సేవలందించారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ నుంచి పోటీ చేసేందుకు క్షేత్రస్థాయిలో ఆమె పర్యటిస్తుండగానే హఠాన్మరణం చెందారు. సత్యవతికి భర్త కుంజా ధర్మారావు, వివాహితుడైన కుమారుడు సంతోష్, కుమార్తె విశ్వశాంతి ఉన్నారు.

ఏజెన్సీలో కార్పొరేట్ వైద్యం కోసం..

సత్యవతి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు భద్రాచలం ఏజెన్సీలో గిరిజనులకు కార్పొరేట్ వైద్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చేందుకు తీవ్రంగా కృషి చేశారు. ప్రస్తుత ఏరియా ఆస్పత్రిలోని నూతన భవనంలో 100 పడకల ఆస్పత్రి ఆమె హయాంలోనే మంజూరైంది. దీంతో పాటు అన్ని ఎమర్జెన్సీ విభాగాల్లో వైద్యులను అందుబాటులో ఉంచాలని ప్రభుత్వాన్ని పలుమార్లు కోరారు. అయితే భద్రాచలంలో అదే ఎమర్జెన్సీ వైద్యం సకాలంలో అందక ఆమె మృతిచెందారు.

పలువురి సంతాపం

సత్యవతి మృతదేహాన్ని భద్రాచలంలోని భగవాన్‌దాస్ కాలనీలోని ఆమె స్వగృహంలో ఉంచగా ఎమ్మెల్యే పొదెం వీరయ్యతో పాటు పలు రాజకీయ, కుల, స్వచ్ఛంద సంస్థల నాయకులు, ప్రముఖులు సందర్శించి నివాళులు అర్పించారు. ఆమె కుటుంబ సభ్యులను ఓదార్చారు. హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ కూడా ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు.

అ'పూర్వ' సమ్మేళనం!


విద్యాబుద్ధులు నేర్పించిన గురువులతో పూర్వవిద్యార్థులు

పాతికేళ్ల తర్వాత కలుసుకున్న మిత్రులు

జూలూరుపాడు: జూలూరుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1998–1999 బ్యాచ్ విద్యార్థుల సమ్మేళనం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. పాతికేళ్ల తరువాత పూర్వవిద్యార్థులు వారి కుటుంబసభ్యులతో తాము చదువుకున్న పాఠశాలల్లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆనాటి హెచ్‌ఎం విశ్వనాథరాజు, ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, రామ్మూర్తి, వీరనారాయణ, నాగేశ్వరరావు, మణెమ్మ, వాణి, జూనియర్ అసిస్టెంట్ సునీల్, ప్రస్తుత హెచ్‌ఎం లక్ష్మీనర్సయ్యను సన్మానించారు. తొలుత గురువులను ప్రత్యేక వాహనాల్లో పూలు చల్లుతూ మేళతాళాలతో బస్టాండ్ సెంటర్‌నుంచి హైస్కూల్‌కు తీసుకొచ్చారు. ఈసమావేశంలో పూర్వ విద్యార్థులైన హైదరాబాద్ ఇన్‌కం టాక్స్ కమిషనర్ ఐ.హేమలత, కొత్తగూగెం సింగరేణి ఉమెన్స్ కళాశాల అధ్యాపకులు కె.ఆశాజ్యోతి తదితరులు మాట్లాడుతూ తాము ఉన్నత స్థాయికి చేరడానికి గురువులే కారణమని తెలిపారు. ఇన్నాళ్ల తర్వాత స్నేహితులు, గురువులను కలుసుకోవడం ఆనందంగా ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాదినేని సతీష్, కొలిపాక సురేష్, పెండ్యాల నరేష్, గువ్వల రఘురాం, ఏదులాపురం నర్సింహారావు, ఎస్.కే.కరీముల్లా, పోలూరి నరేష్, సిరిపురపు రాంబాబు, నాగా కోటేశ్వరరావు, కె.ఆశాజ్యోతి, హేమలత, కల్యాణి, జ్యోతి, లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.


గురువు విశ్వనాథరాజును తీసుకొస్తున్న పూర్వవిద్యార్థులు

మానసికంగా బలంగా ఉండాలి

- స్పోర్ట్స్‌మీట్ ముగింపు సమావేశంలో డీఎస్పీ వెంకటేశ్
- ఓవరాల్ చాంపియన్‌గా నిలిచిన ఇల్లెందు

ములకలపల్లి: విద్యార్థులు చిన్నచిన్న సమస్యలకు కుంగిపోకుండా మానసికంగా బలంగా ఉండడం అలవర్చుకోవాలని పాల్వంచ డీఎస్పీ వెంకటేశ్ సూచించారు. ములకలపల్లిలోని టీఎస్‌డబ్ల్యూఆర్‌లో నిర్వహించిన 9వ లెవల్ స్పోర్ట్స్‌మీట్ ముగింపు సమావేశం సోమవారం నిర్వహించగా, ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ఏదైనా సమస్య వస్తే కుటుంబీకులు, ఉపాధ్యాయులకు చెప్పాలే తప్ప తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని తెలిపారు. తాను డీఎస్పీ విధులు నిర్వహిస్తున్నా ఇప్పటికే గురువులను కలుస్తూనే ఉంటానని.. తద్వారా భవిష్యత్‌లో ఎదగడానికి ఆస్కారముంటుందని చెప్పారు. అనంతరం గురుకులాల ఆర్‌సీఓ ప్రత్యూష మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడలు, సాహిత్యం, సాంస్కృతిక రంగాల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. కాగా, పోటీల్లో ఓవరాల్ చాంపియన్‌గా నిలిచిన ఇల్లెందు పాఠశాల నిలవగా విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి, ప్రిన్సిపాల్ సునీత అధ్యక్షతన జరిగిన సమావేశంలో డీఈఓ వెంకటాచారి, డీసీఓ వెంకటేశ్వర్లు, డీవైఎస్ఓ పరంధామరెడ్డి, పాల్వంచ సీఐ వినయ్‌కుమార్, ఎంఈఓ శ్రీరామ్మూర్తి, ఏఎంఓ నాగరాజు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



చాంపియన్‌గా నిలిచిన ఇల్లెందు జట్టుతో డీఎస్పీ, ఆర్‌సీఓ తదితరులు

బావపై బావమరిది గొడ్డలితో దాడి

బూర్గంపాడు: బూర్గంపాడుకు చెందిన మల్ల రమేష్‌పై అతని బావమరిది నీరుడు జంపన్న గొడ్డలితో దాడికి పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. బావ రమేష్ కొంతకాలంగా తన అక్కను కొంతకాలంగా ఇబ్బందులు పెడుతుండటంతో విసుగు చెందాడు. ఆదివారం బూర్గంపాడు ప్రధానకూడలిలో బావను గొడ్డలితో నరికేందుకు యత్నించాడు. ఈ క్రమంలో అతను చేయి అడ్డుపెట్టగా చేతికి తీవ్ర గాయమైంది. అతనిని స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సై రాజ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హత్య కేసులో నిందితుడికి జీవితఖైదు

కొత్తగూడెంటౌన్: పథకం ప్రకారం వ్యక్తిని హత్య చేసిన కేసులో ముద్దాయికి జీవితఖైదుతో పాటు రూ.1000 జరిమానా విధిస్తూ సోమవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ తీర్పు చెప్పారు. తీర్పు వివరాలు ఇలా ఉన్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లా గనపురానికి చెందిన చెల్పూరి వెంకటేష్, రాధిక దంపతులు ములకలపల్లి మండలం గొల్లగూడెం వచ్చి కిరాణషాపు, పత్తి వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో 2017, సెప్టెంబర్ 20న వెంకటేష్‌ను గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేయగా, భార్య ములకలపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు ములకలపల్లికి చెందిన జంగలి సాయి, జంగలి రమేష్‌లు హత్య చేసినట్లు గుర్తించారు. వీరిద్దరూ పాల్వంచకు చెందిన పాతూరి పార్థసారథి జామాయిల్ తోటలో పని చేస్తూ చెల్పూరి వెంకటేష్ దగ్గర దొంగతనం చేయాలని ముందస్తుగా పథకం రూపొందించుకున్నారు. ఈ క్రమంలో వెంకటేష్ తన వాహనం దగ్గరకు వచ్చి డబ్బులు లెక్కపెట్టుకుని జేబులో పెట్టుకోగానే ఇనుపరాడ్డుతో తలపై, ముఖంపై బలంగా కొట్టడంతో చనిపోయాడు. వెంకటేష్ జేబులో ఉన్న రూ.21,000 ఇద్దరు పంచుకుని మృతదేహాన్ని పాములేరు వాగు వద్ద జామాయిల్ తోట పక్కన పడవేశారు. విచారణ చేపట్టిన పోలీసులు నిందితులను అరెస్టు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణ సమయంలోనే మొదటి ముద్దాయి జంగిలి సాయి మృతి చెందాడు. 20 మంది సాక్షులను విచారించిన అనంతరం నేరు రుజువు కావడంతో రెండో ముద్దాయి జంగిలి రమేష్‌కు జిల్లా జడ్జి పాటిల్‌వసంత్ 302 సెక్షన్ ప్రకారం జీవితఖైదు, రూ.1000 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పోసాని రాధాకృష్ణమూర్తి వాదించగా, కోర్టు లైజన్ ఆఫీసర్ ఎస్. వీరబాబు, కోర్టు డ్యూటీ ఆఫీసర్ , హెడ్ కానిస్టేబుల్ రామారావు సహకరించారు.

దాడి ఘటనలో కేసు నమోదు

పాల్వంచరూరల్: భార్యతోపాటు ఆమె అక్క చెల్లెళ్లపై దాడిచేసిన వ్యక్తిపై సోమవారం పోలీసులు కేసు నమోదుచేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని దంతలబోరు ఎస్సీ కాలనీకి చెందిన కారుమంచి మానస, అన్నమయ్య దంపతులకు ఈ నెల 11న గొడవ జరిగింది. దీంతో మానస తన సోదరి వెంకటరమణ ఇంటికివచ్చింది. మరుసటి రోజు అన్నమయ్య కూడా వచ్చి భార్యను బూతులు తిడుతూ కొట్టాడు. వారించబోయిన ఆమె అక్కాచెల్లెళ్లు సావిత్రి, వెంకటరమణలపై కూడా దాడి చేశాడు. దీంతో వారికి గాయాలయ్యాయి. అనంతరం గ్రామంలో పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ పెట్టారు. అక్కడ కూడా ఇష్టం వచ్చినట్లు బూతులు తిట్టాడు. దీంతో వెంకటరమణ ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కార్తీక్ తెలిపారు.

కానిస్టేబుల్ విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై..

పాల్వంచరూరల్: మండల పరిధిలోని తోగ్గూడెం గ్రామానికి చెందిన మహిపాల్‌ను ఓ కేసు విషయమై ఈ నెల 14న పోలీసుస్టేషన్‌కు పిలిపించారు. తనను ఎందుకు పిలిపించారని వాగ్వాదానికి దిగడంతోపాటు విధులకు ఆటంకం కలిగించాడంటూ కానిస్టేబుల్ తేజావత్ నాగేశ్వరరావు ఉన్నతాధికారులతోపాటు పోలీసుస్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. దీంతో మహిపాల్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కార్తీక్ తెలిపారు.

గ్రామీణ వైద్యుడి ఆస్పత్రి సీజ్

అశ్వారావుపేటరూరల్: మహిళ మృతికి కారణమైన ఆరోపణల నేపథ్యంలో గ్రామీణ వైద్యుడి ఆస్పత్రిని సోమవారం వైద్య శాఖ అధికారులు సీజ్ చేశారు. మండలంలోని వినాయకపురం కాలనీకి చెందిన సృజన(23) జ్వరంతో బాధపడుతున్న క్రమంలో పరిస్థితి విషమించి మృతి చెందిన సంగతి తెలిసిందే. ఇదే విషయమై 'సాక్షి'దినపత్రికలో కథనం ప్రచురితం కాగా, స్పందించిన స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి రాందాస్ నాయక్ ఆధ్వర్యంలో ఆర్‌ఎంపీ ఆస్పత్రిలో విచారణ చేశారు. సదరు మహిళకు వినాయకపురం గ్రామానికి చెందిన ఓ గ్రామీణ వైద్యుడు పరిమితికి మించి వైద్యం చేసినట్లు గుర్తించి ఆస్పత్రిని సీజ్ చేశారు. సదరు గ్రామీణ వైద్యుడిపై విచారణ కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి అజ్మీర వెంకటేశ్వరరావు, పర్యవేక్షకులు శ్రీనివాస్, హెచ్‌ఈవో రాజు పాల్గొన్నారు.


ఆర్‌ఎంపీ ఆస్పత్రిని సీజ్ చేస్తున్న అధికారులు

31 మంది బైండోవర్

దుమ్ముగూడెం : మండలంలోని 31 మందిని తహసీల్దార్ చంద్రశేఖర్ ఎదుట సోమవారం బైండోవర్ చేశారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ముందస్తుగా మండలంలోని 31మంది బెల్ట్ షాపుల నిర్వహకులు, నాటుసారా విక్రేతలను బైండోవర్ చేసినట్లు అధికారులు తెలిపారు.

9 కిలోల గంజాయి స్వాధీనం

ఇల్లెందు: భద్రాచలం నుంచి కాజీపేటకు అక్రమంగా తరలిస్తున్న 9 కిలోల ఎండు గంజాయిని ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా ఓ బైక్ మీద గంజాయి తరలిస్తుండగా కరెంటాఫీస్ వద్ద పట్టుకున్నారు. కాజీపేటకు చెందిన ఇద్దరు వ్యక్తులు గనిపాక సాయికృష్ణ, బల్దీ నర్సింహ్మలను అదుపులోకి తీసుకుని, బైక్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. పట్టుబడ్డ గంజాయి విలువ రూ.2.25 లక్షలు ఉంటుందని అంచనా. అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కరంచంద్, సీఐలు నాగేశ్వరరావు, రాంప్రసాద్, ఎస్ఐలు పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ అధికారులు

పాముకాటుతో మహిళ మృతి

ములకలపల్లి: పాముకాటుతో మహిళ మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని కొమరంభీంనగర్‌లో సోమవారం చోటు చేసుకుంది. కుటుంబీకుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన వంకా దేవి (45) ఆదివారం రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా పాముకాటు వేసింది. కుటుంబీకులు మంగపేట పీహెచ్‌సీకి, అక్కడి నుంచి 108 వాహనంలో పాల్వంచ ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొంది సోమవారం ఇంటికి వచ్చాక ఆరోగ్యం విషమించి మృతి చెందింది.


దేవి మృతదేహం

అనారోగ్యంతో అంగన్‌వాడీ టీచర్ మృతి

పాల్వంచరూరల్: మండల పరిధిలోని ఉల్వనూరు గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ సర్ప శారద(30) అనారోగ్యంతో సోమవారం మృతి చెందింది. వారం రోజులుగా వాంతులు, విరోచనాలతో బాధపడుతూ పాల్వంచ, కొత్తగూడెం పట్టణాల్లోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందింది. నయంకాకపోవడంతో శుక్రవారం వరంగల్ ఎంజీఎంతరలించగా చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతిచెందింది. మృతురాలికి భర్త రమేష్, 8వ, 6వ తరగతులు చదువుతున్న ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె పుట్టిన రోజే తల్లి మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.


సంతాపం తెలుపుతున్న డీడబ్ల్యూఓ విజేత, సీడీపీఓ కనకదుర్గ

రూ.30వేల ఆర్థికసాయం

ఉల్వనూరులో శారద మృతదేహాన్ని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమాధికారి విజేత, సీడీపీఓ కనకదుర్గ సందర్శించి సంతాపం తెలిపారు. మృతురాలి భర్తకు రూ.30 వేల ఆర్థికసాయం చేశారు. తోటి అంగన్‌వాడీ టీచర్లు కూడా మరికొంత సాయం అందించారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.